
అన్వేషణ
ఎమ్.ఎన్.ఆర్.కుమారి

# అన్వేషణ

ఎమ్.ఎస్.ఆర్. కుమారి

సెల్: 9290669741

# అన్వేషణ

**(కవితా సంపుటి)**


ఎమ్.ఎన్.ఆర్.కుమారి

సెల్: 9290669741



సర్వహక్కులు రచయిత్రివే.



ప్రచురణ: జనవరి 2013

వెల: రూ. 50

డి.టి.పి.:

స్పందన పబ్లికేషన్స్,

విజయవాడ - 2

ముద్రణ:

వాసు ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ

# నివేదన

ఈ అనంత సృష్టికి జగత్ నిర్దేశకుడివి
నీవేనని నాకు తెలుసు
సృష్టి ఆదినుండి అలుపెరుగక
జీవయజ్ఞాన్ని నిర్వర్తిస్తున్న విధాతవు
నీవేనని నాకు తెలుసు, కానీ
ప్రభూ! యీ సువిశాల ప్రపంచంలోకి
మనసులేని మనుష్యుల మధ్య
నిర్దాక్షిణ్యంగా నన్ను బ్రతకమని
ఎందుకు లిఖించావో తెలియదు.
ఏ ఒక్కరోజైనా నిన్ను మన:స్ఫూర్తిగా
స్మరించుకుని, నీకు నైవేద్యం పెట్టాలనుకున్న!
కానీ ఆ ఆవేదన నీకు నివేదనగా
మారుతోంది! నా చుట్టూ ఎన్నో పూలున్నాయి.
కానీ వాటిలో ఏవీ నీపాద స్పర్శకు
నోచుకోలేదు. అవి కూడా నాలానే నిన్ను
చేరాలని నిత్యం రోదిస్తున్నాయి.
సృష్టి, స్థితి, లయకారకుడవై నాలోని
సర్వ ప్రకృతిని సృష్టించి, నాకు నేనే
ఒక అనాది స్వరూపాన్నై సాక్షాత్కరింపజేసే
అద్భుత లీలా విలాసం నీదేనని తెలుసు
నిన్ను ఎవ్వరూ కనిపెట్టలేరని అనుకుంటున్నావు కదూ
నిన్ను నేను కనిపెట్టాను ప్రభూ!
సకల చరాచర జగత్తులో అనంత కోటిజీవ
శిల్పాల్లో, ప్రాణిశక్తి నీవై, వూపిరివేణువులూదే
జీవ చైతన్య ఝరి నీవేనని నాకు తెలుసు
యీవుశ్చ్వాస, నిశ్చ్వాసల్లో నిరంతరం కన్పించే నీ సూక్ష్మరూపం
అఖండ దివ్యజ్యోతియై, నాలో ఆత్మగా నిలిచివుందని
నేను గ్రహించాను, వెలుగులో, చీకటిలో సైతం
నీవునికి కన్పిస్తూ వుంటుంది.

అసుర సంజెవేళ... సంధికాలం... ఎవరి జీవన చిత్రాన్ని
ఎలా లిఖించాలో, ఎలా చిత్రీకరించాలో
అనుకుంటూ నువ్వు దీర్ఘంగా ఆలోచిస్తూ, పొరబాటున
నీకుంచెతాకి ఒలికిన రంగులు... గగన తలాన మేఘాల
చేరిన వేళ... ఆకసాన కన్పించే రంగు, రంగులు మబ్బుల సమూహంలో,
నీ నిరంతర శ్రమలో నువ్వెంత అలసిపోయావో కన్పిస్తుంటుంది.
విశ్రాంతి తీసుకోవాలని నీకు మాత్రం అన్పించదూ... నువ్వే
విశ్రాంతి తీసుకుంటే ఒక్కక్షణం యీ
జగతిచిత్రం, ఛిద్రమై పోతుందని.
నిరంతరం, అహరహం యీ సృష్టియాగాన్ని
రచిస్తూ వస్తున్న నీకుసాటి ఎవరున్నారు ప్రభూ!...
కానీ భ్రూ నన్ను మాత్రం ఎందుకిలా శపించావో?
నిన్ను ప్రశ్నించే హక్కు నాకు లేదని తెలుసు...
పరమాణువులా సూక్ష్మంలో విహరించే నా ఆత్మను
గర్భవాసాన నెట్టి, మానవాకృతిగా రూపునిచ్చావు
యీ ఆకృతికి వూపిరి శిక్షవేసి జీవితాన్నిచ్చావు
అనుక్షణం జీవితాన్ని నరకమయంగా చేసి
నన్ను జీవితఖైదుని చేశావు!.... నా వేదనని
నివేదించుకోవడానికి వీలు లేకుండా
నాహృదయాన్ని నిలువునా దహించావు
నిరంతరం క్షోభావిష్కరణ చేస్తోన్న యీ
జీవన చిత్రం... ఎపుడు చిద్రమైపోతుందా?
అని అంతరాత్మ ఆశగా ఎదురు చూస్తోంది.
నా వూపిరి శిక్ష తొలగించే, నీ చిరుపాదస్పర్శ
కోసం నా వీనులెంతగా పరితపిస్తున్నాయో!.
నీవెంత త్వరగా వచ్చి నన్ను యీ దేహ
కారాగారం నుంచి విముక్తను చేస్తావోననే
చిరు ఆశతో, నావేదనని నీకు నివేదిస్తున్నాను.
ప్రభూ నా నివేదన ఆలకించలేవా?

# అన్వేషణ

ఒంటరిగా కూర్చుని ఆకాశంలో
నక్షత్రాల్ని లెక్కిస్తూ వుంటాను!
ఎక్కడో చిన్ని ఆశ! నువ్వొస్తావని!
నా వెనుకగా నీవొచ్చి నాకన్రెప్పలను
మూస్తావని, నీ చిరుస్పర్శలోనే పులకింతని
అవ్వాలనే చిరుఆశ!...
కానీ ఎన్ని రాత్రులు గడిచినా నువ్వు రాలేదు!
యిప్పటికి చీకటినిండిన నింగిలో
ఎన్ని నక్షత్రాలు లెక్కించానో తెలియదు!
నువ్వు రాలేదన్న వూహమదిలో మెదిలిన
నువ్వొస్తావో, రావో నన్న సందిగ్ధంలోనే
జీవితం సగం గడిచిపోయింది! మనసు
మాటున దాగిన నిరీక్షణా క్షణాలు యుగాలై,
హృదయాన్ని భారంగా చేస్తున్నాయి!
నీకోసం కొండలే దాటానో, కోనలేదాటానో
అగాధాలే అధిరోహించానో కానీ నువ్వు రాలేదు!
మరిక వస్తావన్న ఆశనిర్వీర్యం అవుతోంది!
ఎటూకదలనేని స్థితిలో నిరామయినై
ఎవరికోసం యీ ప్రయాణాన్ని ప్రారంభించానో
వారికోసం వెతుక్కుంటున్నాను
నాకన్నులు కాంచే ఆ రూపం
నేనీజన్మకుచూడలేనని నాకు తెలుసు
ఆ విషయం తలచుకున్నపుడు
అప్రయత్నంగా చెక్కిట జారే కన్నీటికి
తెలియదు, యీ జన్మకీ, యీ అన్వేషణకి
అంతంలేదని!... చుట్టూ చీకటి తెరలు
నెమ్మదిగా పరుచుకుంటున్నాయి!
నేచుక్కలు లెక్కిస్తూనే వున్నాను!

# వనవాసి

నేను అడివి చెట్టుకి పూసిన
మల్లెపువ్వుని, విధి విసిరేసిన
విషాద గీతికను అనుభవాలు
రగిల్చిన చితిలో దహనమైపోతున్న
హృదయానికి శాంతి ఎలా వుంటుంది?
జీవితం నాకు ఎన్నో కఠిన సత్యాలను
బోధించింది! కష్టాలూ, కన్నీళ్లు నా
నిత్యజీవితంలో భాగమై కలిసి
పోయాయి! కష్టం మీద కష్టం వచ్చే
యీ జీవితం ప్రతిక్షణం ఒక
నరక సదృశ్యమై, నిత్యావమానాల
అగ్నిలో నన్ను నిలువునా దహిస్తూనే వుంది
ఆశలన్నీ రాలిపోయిన శ్వేత పత్రాలవలె
దిగులుగా చూస్తున్నాయి!. పోగొట్టుకోవడానికి
కూడా ఏమీ మిగలని శిధిలపు బ్రతుకు
తోటలో వనవాసినై, రాని వసంతం కోసం
వెర్రి గా వేచిచూస్తూ నిలిచివున్నాను!
ఏదో ఒక లిప్తలో నామరణమనే స్నేహితుడు
నన్ను వెతుక్కుంటూ వస్తాడు! అపుడు
జీవశ్ఛవంలా యీ దేహంలో బందీగా
విలపిస్తున్న నాలోని నాకు అంత్యోదయమే
తొలివేకువ వుషస్సు అవుతుంది!
అప్పటివరకు శిధిలతోటలో
వనవాసినై నిరీక్షించవలసిందే!

# జీవన చిత్రం

ఊహల రెక్కలపై ఆశల విహంగంలా
స్వేచ్ఛగా విహరించే స్వాప్నికం ఎపుడూ
అందంగానే వుంటుంది!... జీవితమంటే
పంచరంగుల మయంకాదు
జీవితమంటే నిరంతరం క్షభావిష్కరణ
చేసే చీకటి తెరలాంటిది!
అందమైన సీతాకోకచిలుక తన వన్నెల
చిన్నెల రెక్కలు సాచి వనమంతా విహరిస్తుంటే
ఎంత యీర్ష్యగా వుంటుందో, కానీ ఆ ఆకృతి
వెనుక ఎంతటి మరణ వేదన దాగివుందో,
గొంగళి దశలో ఆసీతాకోకచిలుక
ఎంతనరకం అనుభవించిందో, ఎవరు
మాత్రం గ్రహించగలరు!...
చివురులు వేసిన వసంతం, పచ్చనితోరణాలతో
నయనారవిందం కలిగిస్తుంటే ఆకులో
ఆకులా, పువ్వులో పువ్వులా యీవనాన దాగి
పోవాలనిపిస్తుంది. కానీ వసంతం రావాలంటే
ప్రకృతి నిస్సిగ్గుగా తనని తాను ఆకులు
రాల్చుకుని నగ్నంగా ఆవిష్కరించుకోకపోతే
చివురులు వేసే వసంతం తిరిగి చూడదు!
ఏదైనా ఒక అద్భుతం జరగాలి అంటే
ఏదో ఒకటి జరగాలి! కొన్ని పొందాలంటే
కొన్నింటిని పోగొట్టుకోవాలి! అదే సృష్టి
విలాసం! ప్రళయమేఘవర్షం హర్షధారలా
కాక పెనుతుఫాన్‌లా మారితేనే తప్ప ధరిత్రి
ప్రక్షాళన సాధ్యంకాదు. అలాగే మనిషి
జీవితం కూడా అనుభవాల హాలా, హల
జ్వాలల్లో రగిలితేనే తప్ప నిజమైన
జీవన చిత్రం ఆవిష్కరించదు.

# మారణహోమం

ఒకోసారి నిలువెత్తు చైతన్యాన్ని
క్షణాల్లో నిర్జీవం చేయాలంటే
కత్తులు, కటార్లూ అవసరం లేదు
నిశ్శబ్ధంగా దూసుకువచ్చి తీరం వెంట
సేదతీరే మానవాళిని అమాంతం
మింగేసిన సునామీ స్వైరవిహారం
మనిషి వూహకందని మారణహోమం
ప్రకృతి విలయం కావచ్చు, భూకంపం
కావచ్చు! పెనుతుఫాన్ కావచ్చు, రాక్షసఅలల
సమాహారం కావచ్చు, పైశాచికత్వం
కరాళనృత్యం చేసే వూచకోతకావచ్చు!
సజీవ దహనాలు కావచ్చు! మనుష్యులంతా
తమదైన, అస్థిత్వాన్ని, సజీవత్వాన్ని
ఒకేసారి మూకుమ్మడిగా మృత్యుదేవత
గాఢపరిష్వంగంలోకి చేరటానికి
రణవేదిక ఏదైనా కావచ్చు!
ఏమైతేనేం? చివరి ఫలితం ఒక్కటే
అనంత మృతదేహాల మృత్యుహేల!
అంతులేని శవాల గుట్టలమధ్య
రక్తబంధాల, ఆత్మీయ భౌతిక కాయాల
కోసం అన్వేషించే ఆప్తబంధువుల
ఆక్రందనలే అశ్రుతర్పణాలై...
నివాళులర్పిస్తాయి.
అపుడిక కుల, మత బేధాలు
వైదిక కర్మలు ఏవీ ఉండవు
మానవత్వంతో తరలి వచ్చినవారు
నిండుమనసుతో చేసే సామూహిక
ఖననాలే మిగుల్తాయి.

ఒక మహావిషాదం ముగిసిన అనంతరం
శ్మశాన వైరాగ్యం మదిని నిర్వేదం చేస్తుంది.
వేదిక ఏదైనా కావచ్చు! కానీ ఎప్పటికప్పుడు
అంతులేని మారణహోమాలు జరిగినపుడు
మనిషి జీవితం ఎంతటి క్షణభంగురమో!
అన్పిస్తుంది! అంతే రెప్పపాటు జననం,
రెప్పపాటు మరణం... యింతేజీవితం.

# తెగుతోన్న శ్వాస - చివరి ఆశ

శిధిలమైన జ్ఞాపకాలు, నిశీధి నీడలై
గతం స్వగతంలా -బ్రతుకు మజిలీలో
మిగిలిన కన్నీటి మరకలు, చివరికి మిగిలే
శూన్యానికి సాక్ష్యాలుగా జీవితం
చరమాంకపు దశలో మరలా ఆరోజులు
వస్తే ఎంత బావుండు!
అందమైన ఆ బాల్యం మధురమైన ఆ యవ్వనం
పెద్దరికం వహించిన ఆ మధ్యవయసు
అంతా మాయమైపోయింది.
కనురెప్పలమాటున దాగిన కమ్మని స్వప్నంలా
కరిగి జ్ఞాపకాల సంకెళ్ళలో మనసు బందీ అయింది
యింకా ఏదో చేయాలనే ఆశ... ఏమీ చేయలేని ఆశక్తత వృద్ధాప్యం రూపంలో
నిర్వీర్యం చేస్తుంటే ఇక యిపుడు ఏం మిగిలింది?
చింకి చాపలా మూలకి విసిరేయబడిన పనికిరాని
వస్తువులా 'నా' అనే వారందరికీ
బరువై, ముళ్ల పొదలా గుచ్చుతున్న ఆత్మీయుల
అసహనపు చూపులు నిలువెత్తు వృద్ధాప్యాన్నీ
బ్రతికి వుండగానే ఖననం చేస్తుంటే
వద్దు... వద్దు పగవారికి కూడా యీ
వ్యార్ధక్యపు శిక్షవద్దు, రక్తసంబంధాల
ఛీత్కారాలు వద్దు, అదే యీ తెగుతోన్న శ్వాసచివరి ఆశ!

# కళంకితులు

ఒక చైతన్య ఝురిలా కదలి.... హృదయపులోతుల్ని స్పర్శించి
మదినిమీటే మనోవీణలా... మధురకావ్యాలు లిఖియించే కవినినేను
అక్షరం నా ఆయుధం... అక్షరం నా ఆయువు
అక్షరమే నాజీవన గవాక్షాల తొలివేకువ కిరణం!
భ్రమించానేమో!....
సాహిత్యవనంలో విరిసిన కవన వృక్షాన్ని అనుకరణ రాక్షసులు
నిలువెల్లా పెకలించి,.... దహించి వేస్తుంటే
"అశ్లీలతే" ఆనవాలుగా మిగిలి.... పుట్టెడు శోకంతో
పుడమిలో నిలిచిన అక్షర కన్య!
అవకాశవాదుల చేతుల్లో పడి తన శీలాన్ని కోల్పోతుంటే
తరాలనాటి ఘన చరిత్రగల కళామతల్లి...
కన్నీటి పర్యంతమై నడివీధినపడింది.
అప్పుడే తెలిసింది!... కళను నమ్ముకోవటం కన్నా...
కళనమ్ముకోవడమే... బ్రతకనేర్చిన వారితనమని!
యిది తెలియని నాలాంటి వారంతా కళకు అంకితమై
"కళంకితలు"గా యీ ధరిత్రిలో మిగిలిపోకతప్పదని!...

# మాతృదేవోభవ

నవమాసాలు మోసి, శిశువుగా ఆకృతినిచ్చి
తన వూపిరినే ఆయువుగా పంచియిచ్చి
జన్మనిస్తుంది అమ్మ!... అనుక్షణం కంటికి
రెప్పలాకాపాడుతూ, ప్రపంచాన్ని
పరిచయం చేస్తుంది అమ్మ!...
బుడి, బుడి నడకల వేగం పెరిగి
పెద్దదయినపుడు అమ్మ మనసు ఎంతో
మురిసిపోతుంది... తన అవసరాలను
ఆకలిని సైతం మరిచి, తన బిడ్డ
బాగుకోసం పరితపించే అమ్మంటే
అవసరాలు తీర్చే సాధనం కాదు!...
ప్రపంచంలో ఏ స్వార్థమూలేని
తల్లిపేగుబంధం విలువ ఎదిగిన
బిడ్డకు తెలియకపోవడం విచిత్రం
అందుకేనేమో కొన్ని సంవత్సరాలు
గడచిపోయి శిశు ప్రాయం నుంచి
యవ్వన ప్రాయంలోకి వచ్చాక
మనిషంత అస్థిత్వం తనకి
చేకూరాక, యిక అమ్మ అవసరం
అనవసరం అన్పిస్తుంటుంది...
నానాటికీ దిగజారుతున్న సమాజవిలువల
ముందు 'అమ్మతనం' విలువ ఏపాటిది!
కండలన్నీ కలిపి నెత్తుటి మాంసముద్దగా
పంచియిచ్చిన కన్నతల్లి బ్రతుకంతా
తనబిడ్డకోసం శ్రమించినా

కడసారి, చూపుకైనా ఆబిడ్డరాకుంటే
ఆ తల్లి అంతిమవేదన వర్ణింపశక్యంకానిది!
జన్మనిచ్చి, జీవితాన్నిచ్చిన తల్లి రుణం తీర్చలేనిది!
'మాతృదేవోభవ' అంటూ తల్లిని పూజించలేక
పోయినా కనీసం కడసారి చూపులకైనా తరలివెళ్ళాలి!
ఏ బంధమైనా పోతే పునర్నిర్మించుకోవచ్చు! కానీ తల్లి
పేగు బంధానికి ఏ బంధమూ సాటిరాదు...
అంపశయ్యపై, ఆఖరి క్షణాలలో తనబిడ్డకై
రెప, రెపలాడే ఆమె ఆత్మశాంతంగా వెళ్ళాలంటే అమ్మకు
బిడ్డఒడే స్వర్గవేదిక అవుతుంది.

# కళాకారులు

కళాకారులంతా స్వాప్నిక జగత్తులో
విహరిస్తూంటారు! కళకోసమే
జీవిస్తుంటారు!... కళ అంటే తెలియని
హృదయాల మధ్యకన్నీరై కరుగుతుంటారు.
విశ్వజగత్తుని చిత్రీకరించే నైపుణ్యం
ఒకరిదైతే, కోకిలగాన మాధుర్యం మరొకరిది,
అసమాన కవిత్వం ఒకరిదైతే, అద్వితీయ
నటనా ప్రాభవం మరొకరిది!...
అలా కళకోసమని జన్మించే కళాకారులంతా
కళంకితులై, ఎన్నో అవమానాలమధ్య
కళను బ్రతికించు కోవాలని, ఆ కళకోసం
అనుక్షణం ఆక్రోశిస్తుంటారు!
యుగ, యుగాలకళాకారుల కన్నీటి కావ్యం
యిప్పటిదికాదు! తరాలు మారినా,
చరిత్రలు తిరగేస్తే కళాకారుల
జీవితాలకి ఎపుడూ సుఖం వుండదు!
తాము దు:ఖసాగరంలో మునిగివున్నా
తమ కళాప్రాభవంతో
కళాకారులెందరో జనుల హృదయాలలో
అనుభూతుల స్వరాల్ని పలికిస్తుంటారు!

# విరహం

విరహమెంత తియ్యనిది... విరహమెంత కఠినమైనది
వెన్నెల మంటల్ని రేపుతూ ఘడియ అయినా వూపిరి
సలపనివ్వదు!.... తోడులేని గువ్వ పిట్టలా గుండెగూటిలో
గుబులు రేపుతుంటుంది. వెచ్చని వూహాలు మదిలో
విచ్చుకునే వేళ... నిజంగా తోడులేని జీవితం వ్యర్థమే
అన్పిస్తుంది... మనసుని వూగించి వూగించి, విరహంతో
అనుభవమనే వేదికపై అనుభూతుల పూల జల్లులా
కురవాలని పరితపించేలా చేస్తుంది.
వర్షభారంతో ప్రకృతి తన విరహాగ్నిని చల్లార్చుకుంటుంది.
ఆకాశం విదిల్చిన వర్షబిందువులు, చిగురాకుల కొసలపై
తుళ్ళింతలాడుతూ ధరిత్రిలో కలిసిపోతాయి!
చినుకు, చినుకులో దాగిన మధుతుంపరలతో,
ప్రకృతి లేత చివుర్లతో సోయగాల్ని సంతరించుకుంటుంది
విరహవేదన తీరిన ప్రకృతి అందంగా సిగ్గుపడుతూ
చీకటి తెరల పరదాల మాటున నిశ్శబ్దంగా ఒదిగిపోతుంది!
వర్షం కురిసివెలసిన ఆశరద్ రాత్రి... చల్లని గాలి
మదినీ తనువుని మధుభరిత వూహాలతో విరహోత్కంఠిన
చేస్తూ వెక్కిరిస్తోంది!... విరహబాధతీరని మనసు
కోర్కెల కొలిమిలా మారి... తనువుని మండించాలని చూస్తోంది
విచ్చుకున్న కలువ రేకుల్లా కళ్ళు నిద్రను దూరం చేస్తాయి
అనుభవాల తుషారబిందువుల్లో నిశాంత స్వప్నంలా
నిశ్శబ్దానుభూతుల్ని నెమరువేసుకుంటూ మనసు
అనుభవం కోసం ఆరాటంగా ఎదురుచూస్తుంటుంది
మేఘాల దుప్పటి మాటునుండి మసక వెన్నెల
దొంగచాటుగా తొంగిచూస్తోంది
గదిలో శరీరం బందీ అయింది!... ఒంటరితనం

వెక్కిరిస్తోంది!... మనసు రెక్కలు విప్పిన విహంగంలా
ప్రియసన్నిధి జాడకోసం, వూహల వీధుల్లో వెతుకుతోంది!
ఎంత వెతికినా జాడదొరకదు!... యీరేయి
నిజంగా ఎంత కఠినమైనది... నల్లనిరాతిలా
యీరాత్రి ఎందుకో కరగనంటోంది!...
ఏ మేఘసందేశం పంపాలన్నా, ఆకాశంలో ఒక్క
శరన్మేఘకలశమైనా కానరాదే!... అన్నీ వర్ష
బిందువులై ప్రకృతి కాంతలో విలీనం అయ్యాయి.
యిక యీ విరహంతీరే దారేది? యిది యిలాగే
హృదయాన్ని ప్రజ్వలింపచేస్తూనే వుంటుంది!

# మాయగాలి

ఎన్ని అనుభవాల గాయాలు?... ఎన్ని అవమానాల అగ్నికీలలు
అయితేనేం!.... వూపిరి కదుల్తూనే వుంది
పరిమళాల్ని నింపితెచ్చే వెఱ్ఱిగాలి దుమ్మూ, ధూళీ
దుర్గంధాన్ని కూడామోసుకొస్తూ వుంటుంది,
ఏదయితేనేం గాలికేంపోయింది?.... దాన్ని శ్వాసించే
జీవేకదా భరించేది!.... అవసరం వున్నంత వరకు
వీచినగాలి, శ్వాసతో ప్రాణంనింపిన గాలి
తన అవసరం తీరగానే స్తంభించిపోతుంది.
గాలి గుణం వున్న ఆయువుని ఆశ్రయించిన దేహం
వూపిరాడక ఛస్తుంది!.... నవరంధ్ర ద్వారాల్లోంచి
ఏదో ఓ ద్వారం తెరుచుకుని ఆత్మ విశ్రాంతిగా
పైకెగిరిపోతుంది... అప్పుడిక మిగిలేది అనంత శూన్యమే గదా
మాయదారి గాలి నా శ్వాసను అలాగేపట్టుకు
వేలాడుతోంది!... ఎంత తరిమేసినా నన్ను వీడిపోనంటోంది
వగలాడి పెనుగాలి నాదేహాన్ని శ్వాసింపజేస్తూ...
నాఆత్మను దేహంలో బంధించి మరీ కులుకుతోంది.
ఏదో ఆశ మినుకు, మినుకుమంటూ ఆరిపోయే
దీపంగా జీవితం ప్రకాశించదా? అనిచూస్తోంటే!...
కాలం వేళాకోళంగా నవ్వుతూ సాగుతోంది
అటువెలుగూ యిటు చీకటికాని సంజెకెంజాయలో
నిర్లిప్తంగా నిలుచున్నా!... చీకట్లు ముసురుకున్నాయి!
అప్పటివరకూ పరుగులు తీసిన
లోకం విశ్రాంతి తీసుకుంటోంది
చీకటి ప్రకృతితో మౌనంగా సంగమించి తిరిగి
వెలుగు తెరని మొఖంమీదేసుకుంది...

రాత్రి జరిగిన చీకటి తప్పుకు సాక్షిగా, ప్రకృతి
ఫలదీరిస్తూ పుష్పిస్తుంది!...
మరలా వెలుగూ, చీకటిగానిసంజెవేళ... నేనలాగే నిల్చున్నాను
లోకం బద్ధకంగా కళ్ళు తెరిచింది రాత్రి కన్న కలల
బరువుల్ని కనెప్పల మాటునుంచి బయటికి తోలేసి
లోకమంతా పరుగేపరుగు అందుకుంది.
యీ ప్రపంచమనే రంగస్థలంపై ఎన్నెన్ని విచిత్ర
కథనాలో, ఎన్నెన్ని ఘటన జీవన చిత్రాలో!
కొన్ని జీవితాలు రాలిపోతున్నాయి! ఎన్నో
జీవులు పుట్టుకొస్తున్నాయి!... నేను మాత్రం
అలా చూస్తూనే వున్నాను!. నావూపిరి
మాయగాలి నన్నెపుడు వీడిపోతుందా అని...

# ప్రకృతి సాక్షిగా

శిశిరపు శైథిల్యంలో...
ఋతుచక్ర భ్రమణంలో
అనుభవంతో పండిన ఆకుల్ని
రాల్చుకుని, నా నగ్నత్వాన్ని
ప్రకృతి సాక్షిగా భరిస్తూ
సిగ్గుతో కుంచించుకు
పోతూ, కొత్త చిగుళ్ళు
తొడిగేటంత వరకు
మోడులా నిలిచి...
ఎన్నో యుగాల కాలచక్ర
గమనంలో యేటేటా
పండిపోతూ ఎండిపోయిన
ఆకుల్ని గతస్మృతులను
సమాధి చేస్తూ...
నాలోనేనే శిథిలమౌతూ
నన్ను నేను చివురింప
జేసుకుంటూ, వాలే కొమ్మల
వసంతాన్ని స్మరిస్తూ,
రాలే ఆకుల శిశిరాన్ని
భరించాలి!...

# చీకటి బ్రతుకులు

హృదయాన్ని జ్వలింజేస్తున్న ఆవేదనలో
ఆక్రోశంలో నీరోదన వినేవారెవ్వరూ లేరు
పవిత్రమైన యీ ధరిత్రిలో ఓ 'స్త్రీ'గా
నీవు జన్మించి అవకాశవాదులచేతిలో
ఆటబొమ్మవే అయినావు!... అంగడిలో
అమ్ముడయ్యే విలాసవస్తువే అయినావు!
విలాసపురుషులు వినోద కేళిలో "నీవు"
రక్తమాంసాలు కరిగిపోయి ఎండిన
ఎముకల గూడులా మారిపోతే "ఎయిడ్స్"
నిన్ను ఆప్యాయంగా దరిజేర్చుకుంటుంది.
ఎందరి చేతుల్లోనో నలిగిన నీ శరీరం
సమాజానికి ఛీత్కారం అవుతుంది
సంఘం చెక్కిన శిలా, శాసనాల వెనుక
ఈ సమాజంలోని ఎందరో చీకటి బ్రతుకుల
కథలు, నీ ఎదలో వెల్లువై పొంగినా
నీవు పెదవి కదపని పేదరాలివి
పతితగా యీ సమాజం నిన్ను వెలివేసినా
నీవు సంఘానికి పట్టిన చీకటి చీడలాంటి
కామాంధుల పాలిట కల్పవృక్షానివి
తర, తరాల నీకన్నీటి కథకు కరుడుగట్టిన
మానవత్వం ఏ మాత్రం కనికరించదు
నీ కన్నీటి వ్యథకు కొంచెమైనా చలించదు
శాపగ్రస్థ జీవితాన్ని భరిస్తున్న ఓ చెల్లీ
నీ కన్నీరే యీ ధరిత్రికి తీరనిశాపం!...

# నువ్వూ-నేనూ?

నువ్వూ నేనూ వేరుకాదు
క్షేత్రం బీజం కలిస్తేనే
ఫలదీకరణం జరిగి మానవజన్మ
సాధ్యమౌతోంది. నువ్వూ-నేను
ఎప్పటికీ సమాంతరరేఖల్లా సాగుతూ
కలుస్తూ విడిపోతుంటాము
ఎన్ని సిద్ధాంతాలూ, ఆదర్శాలు కూడా
నిన్నూ, నన్నూ కలవకుండా ఆపలేవు.
మధుశీతల వేళ... శరీరాలు
విరహజ్వాలతో రగిలిపోతుంటే
తమకం రేగిన నువ్వు నీరక్తపు
సముద్రంలో పోటెత్తిన అలలామారి
నాలో కలిసిపోతావు
నాతో సంగమం నీకెపుడూ మధుభరితమే
అపుడిక నీవూ, నేనూ అనే అస్థిత్వం
ఆ క్షణం ఏ మాత్రం వుండదు
ఎందకంటే ఆ అద్భుత సమాగమం
సృష్టికి శ్రీకారం కనుక
తెల్లవారుతుంది, రాత్రి ఏక శరీరులైవున్న
నువ్వూ, నేనూ బద్ధశత్రువుల్లా మారిపోతా!
హక్కుల కోసం యుద్ధం చేస్తాం.
నాలాంటి ఆడదాని శరీర రక్తమాంసాలు
పంచుకుపుట్టిన నువ్వు తిరిగి నాలోనే

ఒదిగిపోతూ సుఖాల నాస్వాదించే నువ్వు
అడుగడుగునా నా ఆడతనాన్ని కించపరుస్తావేం?
నాలోని అమ్మతనం నీకు కన్పించలేదా?
నీకూ, నాకూ మధ్య కాలం విచ్ఛిన్న యుద్ధాన్ని మిగిలిస్తోంది!
ఓ నాజీవన బాటసారీ నాతోచేసే ప్రతియుద్ధంలో
నీవు ఓడిపోతుంటావని నీకు తెలుసు కానీ
ఆ ఓటమి నీకు అంగీకారం కాదు,
అందుకేగా నిరంతరం నువ్వూ, నేనూ యిలా
జీవితాన్ని రణవేదిక చేసుకుంది!.

# ప్రేమస్వప్నం

నీ ఊహలో ఊపిరినై
నీ ఎదలో పలికే అనుభూతినై
అనుక్షణం నీ కనుపాపల
నీలినీడలలో నే కలల హారతినై
నీ భావంలో భావాన్నై
నీశ్వాసలో శ్వాసనై
అసలు నీ ప్రతిఅణువు అణువూ
నేనై నిండిపోవాలనే ఆర్తి
ఎందుకో తెలియదు. కానీ
నీవే నేననే భావన, మనసుని
మీటిన ప్రణయరాగాలాపన
క్షణమైనా నినువీడి వెళ్ళకూడదనే
పిచ్చిఆరాటం మనసుకి,
ఏమో నిను వీడి వెళ్లాలంటే
యుగాలనుండి
తపస్సు చేసి పొందిన "ప్రేమస్వప్నం, స్వప్నంలా
చేజారిపోతుందేమోనన్న భయం
మావిచివురుని ఆస్వాదించిన కోకిల
ఎందుకు రాగాలాపన చేస్తుందో
నాకు తెలియదుకానీ
ప్రియతమా నను చూసిన
తొలిక్షణంలోనే నా మనసు
పురివిప్పిన మయూరమై నర్తిస్తోంది
ఈ హృదయరాగం నీ ప్రేమరాగం
ఎన్ని జన్మలైనా నీకే అంకితం
సెలయేటి అలల గీతాలు,
మంచుబిందువులు, మల్లెనవ్వులు,
ఉషోదయాలు, వేకువ వెన్నెలలు,

నాటి స్తబ్దతలో నిశ్శబ్దమైన వేళ,
అనంత చైతన్య ప్రవాహంలా,
వేయి శరత్పూర్ణిమాల వెన్నెలరాగంలా
నీరాక నా జీవనోద్యాన వనాన
వసంతమై విరిసినది
నీ ప్రేమతో నా మనసు పువ్వులా
పరిమళించించినది, నీ ఎద పానుపుపై పల్లవి
నేనై ప్రణయ రాగాలను
ఆలపిస్తూ యుగాలు
క్షణాలుగా గడపాలనే
చిన్ని ఆశ

# ఆలోచన

ఏదో ఆలోచన... గుండెను ముక్కలు చేస్తున్నట్టు..
అనుభూతులన్నీ స్వప్నీకరిస్తే..
అదొక విషాదగాథ అయినట్టు!
అడవిలో పూచిన తంగేడు పువ్వులపై పరచుకున్న...
నిశీధి వెన్నెలలా... నిర్వికారమైపోతున్నట్టుగా!...
ఆలోచన తెగదు... ముడిపడదు.
జీవితానికీ, జీవితానికి మధ్య ఏదో తెలియని
అడ్డుతెర! బ్రతుకు భాష్యం నేర్చుకునేలోపే!...
అసందిగ్ధతాభావం ఏదో హృదయాన్ని కప్పేస్తున్నట్టు
చుట్టూ పరుచుకున్న మంచుతెరలు... కరగని
శిలాఫలకాలై  నిలిస్తే!...
కనరాని మనసుఘోష.... మహాసంద్రమై
మరికరాని తీరాలపై సాగే ఒంటరి ప్రయాణంలా!...
ఏదూరతీరాలన న్వేషించి సాగినా!
ఆలోచన అందనిదై... అంబరాన్నంటేవేళ...
ఆ ఆలోచనే ఆవేదనై... కవిత్వమై...
భాషకందని అక్షరమై.... అమరత్వాన్ని
ఆపాదించాలని చూస్తోంది.

# అరణ్యరోదన

నీ తడి కళ్ళ వెనుక దాగిన ఆవేదన
నీకు మాత్రమే తెలుసు
యీ సమాజానికి ఏం తెలుసు?...
అవసరం కోసం నువ్వు ఆడతనాన్ని
తాకట్టు పెడితే అంగడి బొమ్మను
చేసి ఆటపట్టించే విటుల
వినోద కేళిలో, నీవొక మనసులేని
మరబొమ్మవు... యుగాలనాటి
చరితలలో నీలాంటి అభాగినుల
ఆర్తనాదాలెన్నో...
పతితలారా... పతితలారా...
బాధసర్ప ద్రష్టలారా..
ఏడవకేడవకండి, అంటూ నీకోసం...
ఎన్ని కలాలు విప్లవిస్తే మాత్రం
ఏముంది? నీరాత మారదు
ఎన్ని రేయిలు నీగుండె
కన్నీటిలో కరిగిపోయినా...
నీకోసం ఏ మాత్రం జాలి
చూపని రాతి హృదయాలమధ్య
నీ ఆక్రందన అరణ్యరోదనే!...

# చితిమంట

ప్రతిచీకటి తెర వెనుక
హృద్యంగా, బాధాకరంగా,
నలిగిపోయి, చెదిరిపోయి
బెదిరిపోయి భారంగా,
బరువుగా, కాలాన్ని ఆయువు
చేతిలో మడిచి ఆర్తిగా
తీరనివ్యథగా జీవితం ఓ చిక్కు
వీడని ప్రశ్నలా... మళ్లీ
తెల్లవారుతుంది, తెల్లని ముసుగేసుకుని
బాధ్యతల బ్రతుకుని, నయవంచనాలతో
నటిస్తూ బ్రతకాలి కాబట్టి పెదవులపై
జీవంలేని చిరునవ్వొకటి శుష్కంగా
కదిలింపజేస్తూ, ఆత్మవంచనతో
అభిమానాన్ని తాకట్టుపెట్టి
జీవనతీరం ఆవలి అంచును
అన్వేషిస్తూ, చీకటి రెక్కలువిప్పి,
రాత్రిరాబందులా కాలాన్ని కబళించిక
ముందే, భవిష్యత్‌కి పునాది
వేయాలనే వెర్రి ఆరాటంతోనే పగలు
గడిచిపోతుంది నిర్లిప్తంగా
చీకటి వులిక్కిపడి, ఆవలించి నిద్రలేస్తుంది
అకృత్యాలను, ఆవేదనల ఆర్తనాదాలను
తనలో విలీనం చేసుకోవడానికి
గతాన్ని వర్తమానాన్ని ఛేదిస్తూ కాలం
కౌగిలిలో ఒదిగిపోతూ నిశిరాత్రి భవిష్యత్
శూన్యంగా కరుగుతూ వుంటుంది
చీకటి తెరవెనుక చితిమంటలా...

# నక్షత్రం

చిత్ర, విచిత్ర అనుభవాలు
చిరుజల్లులా తొలకరిస్తూనే
వుంటాయి. చినుకు, చినుక్కి
మధ్య తడుస్తూ కన్నీళ్లు రాల్చే
కలువ పూవులా కదిలిపోతాను!
ప్రపంచాన్ని మించిన రహస్యమేదో
గుండెల్లో దాచుకున్నట్టుంటుంది
నిన్ను తలుచుకోగానే!...
నాకెవ్వరూ లేరు, నువ్వు తప్ప...
ఒక సుదీర్ఘ ఒంటరి యానంలో
నీ చిర్నవ్వు చైత్రమై నను స్పర్శించినట్టయింది
నీ జ్ఞాపకాలలో నేనొక అనామికను!
నీ తలపుల వేగంలో నేనొక రాలిన
పుప్పొడి రాగాన్నవుతాను!
లోకమంతా వంచించాకేనేమో
నేను నీదరి చేరాను,
నన్ను దరి చేర్చి ఓదార్చి ప్రేమించిన
నువ్వు... నన్ను నక్షత్రంగా చేసి
నువ్వు చందమామవై,
అందీ, అందని దూరమో, చేరువో
తెలియని, నింగి నిండాపరుచుకున్న
వేలవేన నక్షత్రాలలో, నేను
మాత్రమే నీ సన్నిధిలో..

# 'మనీ'షి

జీవితమే గాయంగా బాధపడేవాళ్ళని
ఏ బాధా ఏమీ చేయలేదు
జీవితం నాకొక అగ్ని పరీక్ష అయినపుడు
నన్ను నేనే ఒక జ్వాలగా మార్చుకుంటాను
బాధలనే నిప్పు కణికలు నాహృదయాన్ని
దహిస్తున్నపుడు, మండే అగ్ని గుండమౌతాను
కష్టాలే నా తలరాత అయినపుడు
నాకు నేనే కఠిన శిలనవుతాను
కన్నీరే నా ఆప్త నేస్తమైనపుడు
సప్త సముద్రాలుగా ఆవిర్భవిస్తాను
అనుభూతి సాంద్రత ఏదీ నా గుండెను
కదిలించలేనపుడు, మంచు శిఖలా
నిలిచిపోతాను... జీవిత మంటే
కష్టాలూ, కన్నీళ్ళూగా నిలిచినపుడు
మనిషిగా జీవించక, 'మనీ''షి'గా బ్రతకడం
ఎలాగో సమాజంనుంచి నేర్చుకుంటాను!

# కన్నీటి భాష

పెదవులపై చిరునవ్వుని చూసి మోసపోవద్దు
ఆ చిరునవ్వు వెనుక దాగిన వేదనల
నీలినీడలను చూసి జాలిపడు
నయనాల మెరిసే తళుకుల్ని చూసి
కలవరపడకు!...ఆ తడి కళ్ళ వెనుక
దాగివున్న జీవిత కాలపు అలసత్వం
వెతికి చూడు, మోడుబారిన బీడునేలపై
వర్షించే ఒకే ఒక తుషారం ఎపుడూ
బీడునేలను తడపలేదు
గుండెగుప్పెట చిక్కిన కన్నీటి వేదనకు
ఏ నిర్వచనాలు అవసరం లేదు
ఎందుకంటే కన్నీటిని మించిన భాష
ఏదీ హృదయాన్ని కదిలించలేదు కనుక!...

# పరిహాసం

చక్కని సాయంత్రాలు లేవు... అందమైన వెన్నెలలు లేవు
బ్రతకంతా ఓ తీరని వ్యథగా మదిని తొలిచేస్తూ వుంటుంది
నా ముందొక అందమైన తివాచీ పరిచివుంది. నేను దానిమీద
అడుగుపెట్టగానే ముళ్ళకంపగా మారింది
ఎన్నియుగాలైనదో, నా జీవితం తొలివుషస్సు
వెలుగు చూసి... నా చుట్టూ మంచులా ఘనీభవించిన
యీ చీకటి ఎన్నటికీ కరగనంటోంది
మనసు నిండిన నైరాశ్యం
నన్ను వీడి పోనంటోంది... అదిగో అల్లంత
దూరాన కన్పిస్తోంది చుక్కలు పొదిగిన ఆకాశం
కనీసం నక్షత్ర కాంతికైనా నోచని
నన్ను చూసి పరిహాసిస్తోంది.

# నిరీక్షణ

ఒక తుషారం రంగుల కలలా
వర్షించిన వేళ క్షణాలు
యుగాలైన నీనిరీక్షణలో
ఆకాలం బరువుగా కదుల్తోంది
ఒకే ఒక్క నీ కోసం ఒక్కసారి
నిన్ను చూడాలనే ఆరాటం
ఆశల ఆకాశం నుంచి పూల
జల్లులా కురిసిన నీటి బిందువులు
కన్నె పిల్ల వలపు కలలై రవళిస్తుంటే,
తొలకరించిన ప్రణయమేఘమాసం
తడిసిన వనకన్నె మోడువారిన శిశిరం
నుండి లేచివుర్ల సోయగాలతో
కళ, కళలాడే ఆ ప్రత్యూష వేళ...
నీ తలపు నా హృదయ క్షేత్రంపై
పన్నీటి జడిలా పరిమళించింది
ఒక్కసారిగా ఎదలోయల
దాగిన శైథిల్యమంతా కనుమరుగు
అయిపోయింది!... నీ స్మృతి
నా మదిని తాకిన క్షణం...
నీ వూహలతో ఎన్ని అనుభూతులు...
ఎన్నెన్ని మధుర జ్ఞాపకాలు
యివన్నీ నీ కోసమే!... ఒకే ఒక్క
నీ కోసమే క్షణమొక యుగమైన
యీ నిరీక్షణ!...

# రసస్పృష్టి

ప్రత్యూష సమయం... నునివెచ్చని
ప్రభాతకిరణాలు, ప్రకృతిని తాకి
తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నాయి!
చిరుగాలి వింజామరలు, తొలిమంచు
ముత్యాల గులాబీ నవ్వులు!
సాగేగాలీ. వూగే చేలూ, లేతచివుర్ల
మాటున విరబూసిన మల్లెల పరిమళాలు,
జాజుల విరిహాసాలు, సెలయేటి
అలికిళ్ళు! దూరంగా కన్పిస్తోన్న
అలనీలి గగనాల అందాలు!
ఓ వైపు హిమపాతాల విన్యాసం,
మరోవైపు ఆకుపచ్చని తీవాచీ పై
రంగవల్లులద్దినట్టున్న సుమహాసాల
ప్రకృతి సొగసు సోయగాలు,
యింకోవైపు అనంత సాగర అలలహోరు!
కిన్నెర వీణలా స్వరిస్తోన్న ప్రకృతికాంతతో
మమేకమై కాలపురుషుడు యజ్ఞం చేస్తున్న వేళ!
ధరణి అనే హంసతూలికాతల్పంపై
ఎన్నెన్ని జీవఫలాలు ఆకృతిదాలుస్తున్నాయో!
యింతటి 'రసస్పృష్టి'ని ఏ చిత్రకారుడు తనకుంచెలతో
కమనీయ దృశ్యావిష్కరణచేశాడో,
ఏ శిల్పకారుడు తన ఆలోచనల శిలలకు
అందమైన రూపు రేఖలనందిస్తూ అహరహమూ
శ్రమిస్తున్నాడో కదా!...

# జీవనతీరం

కాలాన్ని వెనక్కి మడిచి నన్ను నేను
పొందలేను! సాగే కాలం మృత్యువుని
నా దరిచేరుస్తుంటే అపుడు కూడా
నన్ను నేను అందుకోలేను!...
ఎప్పటికప్పుడు క్రొత్తగానే నన్ను నేను
కోల్పోతూ, నా అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే
వెర్రిఆరాటం! నాలో నేను సజీవంగా లేను!
నాలోనేను నిర్జీవంగా లేను!
చేతనాచేతనావస్థలో నన్నునే
పోగొట్టుకుంటూ, వెతుక్కుంటున్నా!
యింకా యీ గుండె కన్నీటితో కొట్టుకోవటం
ఆశ్చర్యంగా వుంది!
మదిగాయమై మౌనసాగరంలా
చూస్తున్నా, ఆలోచనా కెరటాలు మాత్రం
ఎగిసిపడుతూ జీవన తీరాన్ని
అన్వేషించాలని, నిరంతరం శోకిస్తున్నాయి!

# కడపటి లేఖలు

ఒకనాటి ఏకాంతంలో... నన్ను నేను ఆవిష్కరించుకుంటున్న
వేళ... వూహల సుమాలు పుప్పొడి రాగాలు ఆలపిస్తున్న
వేళ... ఏ తుమ్మెద ఝుంకారంతో నీవొస్తావో నన్న
చిన్ని వూహ... అధరాల మధురాల్ని గ్రోలి, నా జీవన
వీణా తంత్రుల్ని మీటి ప్రణయస్వరాలను పలికిస్తావోననే
ఆశ... అల్లి, బిల్లిగా అల్లుకున్న
మధురమైన, వూహల, ఆశల మల్లెతీవెకు నీవు పందిరిగా
నిలుస్తావని ఎంతగా వేచి ఎదురుచూశానో... నీకోసం...
నువ్వురాలేదు... నీకోసం దాచివుంచిన ప్రణయమధుపాత్ర,
విషతుల్యమైపోయింది!ఏదో తెలియని అగాధపు
అందచుల్లోకి నాజీవన పాత్రిక విసిరేయబడింది!
ఎందుకిలా జరిగింది? జవాబులేని ప్రశ్నలా మిగిలాను!
మరలా ఒకనాటి ఏకాంతంలో నన్నునే ఆవిష్కరించుకోవాలని
చూశా! అంతే ఒక్కసారిగా చిగురాకులా కంపించిపోయాను!
శిథిలీకరించిన ప్రకృతిలా నా వూహలు మోడు
బారిపోయాయి! పుప్పొడి రాగాలు విదిల్చివెళ్ళిన
ఆశల సుమాలు నేలరాలి దీనంగా చూస్తున్నాయి!
నాజీవన వీణానాదం తంత్రులు తెగిపోయి
అపశృతి రాగాలను పలికిస్తోంది!
వాడిన పూలతోటలో ఏ తుమ్మెద ఝుంకారాలూ
విన్పించవు! నీకోసం దాచిన యీ అధరామృతం అగ్నిపర్వతంలా
దహిస్తుంటే, ఆ జ్వాలలకి నీ జీవన నందనోద్యానవనంలో
ఆశల పందిరి కాలిపోతోంది!
ఎందుకిలా జరిగింది?... మరలా ప్రశ్న!
జవాబులే లేని నా ప్రశ్నలకు శూన్యం
చిత్రంగా నవ్వింది!... నిశీధినియంతలా
విధి నా జీవితానికి కడపటి లేఖలు రాస్తోంది!....

# పయనం

జగతిన కరిగే హృదయ మేదీ కన్పించదు
కటిక చీకటి రాదారిలో పయనం...
సాగుతూనే వుంటుంది, ఒంటరిగా..
కదలాడే మిణుగురు లెన్నో...
వెలుగు రేఖలని భ్రమింపచేయాలని
చూస్తుంటాయి.  జీవన్మరణపోరాటంలో
జీవితం ఓ చిక్కుపీడని ప్రశ్నలా
మదిని దొలిచేస్తూ వుంటుంది.
తీరాలెన్ని దాటినా గమ్యం చేరని
నావలా, ఎడారిలో సాగే ఒంటరి
బాటసారిలా గమనం సాగిపోతూనే
వుంటుంది.

# నేను

కాలం కరిగిపోతూనేవుంది! సంధ్యారాగాల
వీణియపై రాగాలాపన చేస్తూ క్షణాలు,
నిముషాలై, నిముషాలు గంటలై గంటలు
రోజులై సంవత్సరాల రూపంలో
కాలం ఒడిలో కరిగిపోతున్నాయి!....
నేను ఎంతో శ్రమకోర్చి గూడు కడుతూనే
వున్నాను!.... ప్రతితుఫాన్ పెనుగాలులకి
నాగూడు చెదిరిపోతూనే వుంది! అయినా
నేను గూడు కట్టడం మానలేదు!...
యిలా గూడు కట్టడంతోనే యుగాలు
గడచిపోతున్నాయి! నేను నిర్మించిన
ఎన్నో గూళ్ళు నేలకూలాయి! లెక్కించ
సాధ్యంకానివి నేను కట్టినా నాకు
నివాసం లేకండా పోయింది!...
భిక్షకుని వలె నాహృదయం నిలిచివుంది!
నా చుట్టూ పరుచుకుని వున్న చీకటి
మాత్రం ఎన్నటికీ కరగనంటోంది!
శిశిరం రాల్చి వెల్లిన ఎండుటాకులవలె
నా జీవన తాళపత్రాలు మోడుబారిపోయాయి!
నేనంటే కష్టాలకు ఎంతో యిష్టమో!
అందుకే అవి నిరంతరం నన్ను
వెంబడే వుంటాయి! నేనంటే
వైఫల్యానికి ఎంత మక్కువో!
అందుకే నేను చేసే ప్రతిపనిలోనూ
వైఫల్యం ముందుంటుంది!....
నేనంటే ఒక్క మృత్యువుకే యిష్టంలేదు!
అందుకే నన్నెపుడూ మైళ్ళదూరంలో
వుంచుతుంటుంది!....

# రాతిశిల

నువ్వొస్తావని దారంతా పువ్వులు పరిచివుంచాను!
నువ్వొచ్చావు! పువ్వులన్నీ నిర్ధాక్షిణ్యంగా నలిపేసి
నా హృదయంపై నడుచుకుంటూ వెళ్ళావు!
నీ కోసం ఎదురుచూసినంత సేపు పట్టలేదు!
నీ ఆగమనం కోసం నిరీక్షించిన ప్రతిక్షణమూ
నా గుండెనెంత గాయపరిచిందో నీకు
తెలియదు! అందుకే కదూ! కాలం చేసిన
గాయాలపై మరింత గాయాన్ని చేస్తూ
నువ్వంత నిర్ధయంగా నా గుండెను ముక్కలు
చేయగలిగావు!... ఏవాసంత సమీరమై
వచ్చి హేమంత నాటి శిశిరపు గవాక్షాలు
దాటి శైథిల్యపు జాడల్ని చెరిపేసి,
నా జీవనోద్యానవనాన పువ్వులు విరబూసేలా
చేస్తావని నిన్ను  నమ్మబట్టే కదూ! ఎప్పటికీ
మాననిగాయాన్ని నాకు కానుకగా యిచ్చి వెళ్ళావు
ఎన్నియుగాలనాటి బంధమో, అనుబంధమో
తెలియని నీ ఆరాధనలో, వూపిరి నీవేనని, నా ఆశల
వేకువలకి తొలివుషస్సు నీవేనని నీకోసం
అహరహమూ ఆర్తిగా పరితపించే యీ హృదయానికి
తెలియదు! నీవొక కరగని రాతి శిలవని!
తెలిసేసరికి... కనురెప్పలమాటున దాగిన
కలల రూపంగా కాలం కరిగిపోయింది!
గుప్పెట మూసిన నీటిలా క్షణాలు చేజారిపోయాయి!
నీకోసం చేజారిన కాలం తిరిగి రాదని తెలుసు!
అనుభవాలు రగిల్చిన చితిపై మనసు దహనమై
పోతూవున్నా ఏ తుషారబిందువు కూడా
వర్షించదని తెలుసు... కానీ అంతా తెలిసిన
నా మనసు మాత్రం నీ మనసులా రాతి శిలగా
మారలేకపోయింది.

# చివరికి మిగిలేది?

కన్నుల దాగిన కన్నీటి మేఘాలు, కదిలిస్తే కరిగినీరై
కన్నీరై జాలువారే వేళ... బీడువారిన హృదయక్షేత్రంపై
కన్నీరు కూడా కరువే అయిపోయింది. దిగులుగా
చూస్తోన్న శూన్యాకాశంలో
ఒక్క శరన్మేఘ కలశమైనా కన్పించదే!...
ఆశలు రాలిన జీవన గమనంలో
అణగారిన స్వప్నాలు, చేదు జ్ఞాపకాలు
గరళంలా గుండె గొంతులో జారుతుంటే
బ్రతకలేని నరకయాతన, బ్రతుకు నిస్తోంది
క్షణక్షణం, మనసుని చంపుతూ
వూపిరి నిరవధికంగా పనిచేస్తూనే వుంది
కాలుతున్న కట్టెలా జీవితం ఎప్పటికైనా
చిటికెడు చితాభస్మం కాక తప్పదని తెలుసు,
అయినా గుప్పెడంత గుండెలో పొంగుతున్న
ఆశల హలాహల జ్వాలలు విషాన్ని చిమ్ముతూనే
వున్నాయి. రేపనేది ఒక పెనుభూతంలా
విరుచుకుపడి పరిహసిస్తూనే వుంది!...
శిధిల స్వప్నాల మధ్య విరిగిపడిన
మనసుశకలాలు దీనంగా చూస్తూనే వున్నాయి
గుండెపగిలితే వూపిరి ఆగిపోతుందేమో! కానీ
హృదయం పగిలితే మిగిలేది ఏదీలేదు
వూపిరినింపి కదిలే జీవయంత్రం తప్ప,
కడపటితీరాన, అంపశయ్య వేదికపై
వూపిరి ఆగినరోజు ఆ జీవచ్ఛవం కూడా
పనిచేయటం మానేసి ధరణి ఒడిలో కలిసిపోతే
చివరికి మిగిలేది ఏదీ లేదు.

# గడ్డిపూలు

అనుభవాల గాయాలతో నిండిపోయింది
జీవితం, యిక భరించేందుకు
ఏమీలేదు! ఘనీభవించిన మంచు
శిఖలాంటి నిర్వేదం జీవనాన్ని
నిర్దేశిస్తోంది!... గమ్యం మాత్రం
దుర్లభంగానే వుంది
నేను చల్లిన అక్షరాలు గడ్డిపూలై
మొలిచాయి! అవికూడా నాలాగే
నిష్ప్రయోజకమై శోకిస్తున్నాయి!
క్షణంలో చిదిపితేనే పగిలిపోయే
నెత్తుటి బుడగలాంటి జీవితం
నాకు మాత్రం చెదరని రాతి శిల్పంలా
మారింది! అందుకే కాబోలు
ఎన్ని గాయాలు మనసుని నెత్తుటి గడ్డగా
మారుస్తున్నా వూపిరి మాత్రం ఆగటం లేదు!
బ్రతుకు భారమైంది. వూపిరి బరువైంది!
జీవనోపాధి కోసం అక్షరాలను
గడ్డిపువ్వులుగా మార్చి అమ్ముకున్ననేను
అగ్నిపూలలాంటి అక్షరాలను సృష్టించగలనా?
గడ్డిపూల వాసనలో జనులంతా
పరవశిస్తూ జేజేలు అంటున్నారు!
నిజంగా ఎంతకాలమైందో
మధుభరిత తేటతెనుగు పదాలు సృష్టించి!
కానీమల్లెల పరిమళాల కన్నా,
గడిపూలే బావున్నాయంటున్నారు!
యిదేం చిత్రమో మరి!....

# మేఘమాసం

కాలాలన్నీ కరిగిగ్రీస్మాలన్నీ వసంతాలై
కరిగిపోతున్నాయి! నీ చిరునవ్వు
వేకువలో విరిసిన సుమహాసంలా
నను పలుకరించిన వేళ, ఆ క్షణాలు
నాకింకా జ్ఞాపకమే! తుషార బిందువుల
నిషాంత స్వప్నాలలో, వలపురాగాల
సెలయేటి తుళ్ళింతలలో, నీవూహ
నావూపిరై నిలిచిన వేళ, ఏ తొలకరి
జల్లులోనే మెరిసి మురిసిన శ్రావణ
మేఘంలా నువ్వు నాజీవనోద్యానవానన
ప్రత్యక్షమై మనసుని మురిపించి వెళ్లావు
నాకిప్పటికీ జ్ఞాపకమే సుమా!
నీ చేరువలో శృతిచేసిన వీణలా
తనువూ, మనసూ వలపురాగాల్ని
పలికించిన ప్రణయ రాగలాహిరిలో
కరిగి వర్షించిన మేఘమాసం
క్షణికమే అయినా, ఎంతటి తన్మయత్వం
ఎంత అద్భుతభావన ఎదగదిలో
మౌనంగా మూగిన జ్ఞాపకాల సమూహంలో
నీతో కలిసినే పంచుకున్న మధురమైన
అనుభూతి సాంద్రత నయనాల
వర్షధారలా కరిగిపోతోంది.

# మరణవేదిక

క్షణంలో రాలిపోయే ఆశల శకలాలు
కనురెప్పపాటులో పగిలిపోయే నెత్తుటి
బొమ్మకువూపిరి యింధనం ఆయువవుతుంది!
ఆయువు కాలమనే వేదికపై నర్తించే
నాట్య కత్తెలాంటిది! వూరించి, వూరించి
మనసుని వుత్తేజింపజేసి, మటుమాయమై పోతుంది!
అపుడిక శరీరమనే అస్థిత్వం నిర్జీవంగా మారుతుంది!
కాలమనే చెట్టు క్రింద ఎందరో సేదతీరుతున్నారు!
ఎవరికి వారే చెట్టు తమ సొంతం అనుకుంటారు!
కానీ కడపటి పిలుపు వస్తే కనుమరుగైపోతారు!
చెట్టు నవ్వుకుంటుంది. వారి అమాయకత్వం చూసి
శూన్యంలోంచి, శూన్యంలోకే సాగే ప్రయాణం
ఏదో ఒక రోజు ప్రతి ఒక్కరూ మరణమనే
వేదికను అలంకరించవలసిందే!...

# మనసు ఘోష

నది ఒడ్డున కూర్చుని ఎన్ని కబుర్లయినా
చెప్పవచ్చు! దిగినవాడికేగా నదిలోతు
ఎంతో తెలిసేది
కడుపు నిండిన వాడికవిత్వం
కమ్మగా వుంటుంది! కడుపు
మండిన వాడి కవిత్వం ఆకలిగా
వుంటుంది!... అవసరాలు తీరాక
యిక అంతా అనవసరమే అన్పిస్తుంది!
గూడులో నిశ్చింతగా బ్రతికేవాడు
గూడులేని వాడి వ్యధను ఎలా తెలుసుకుంటాడు?
ఎంతసేపూ తన సౌఖ్యం చూసుకొనే
మనిషి, ఎదుటి మనిషి జీవితంలోని
అల్లకల్లోలాన్ని ఎలా గుర్తిస్తాడు?
ఏదయినా అంతే! తమదాకా వస్తేనే
దు:ఖం విలువ తెలిసేది!
ఎదుటి వ్యక్తిలోని సుగుణాల్ని
సైతం గడ్డిపోచగా తీసేసే
మహనీయులున్న సభ్య సమాజంలో
కన్నీటికి విలువ లేదు!
పాషాణ హృదయాలకి
కఠినాత్ములకి, బడుగు జీవుల
వ్యధాభరిత మనసు ఘోష
విన్పించదు!.... నిలువెత్తు స్వార్థం
నెలకొన్న నేటి మనిషి, ప్రపంచీకరణ
పేరుతో విశ్వం మొత్తాని ఒక చోట
చేర్చినా, కన్నీటి వేదనకు
రవంత చలించని మనసు వైశాల్యం
ఎంతగా కుంచించుకుపోయిందో
ఎవరు మాత్రం ఎందుకు గుర్తిస్తారు?

# శిథిల శిశిరం

మధుమాసం వస్తుంది, వసంతం
తప్పక తెస్తుందని అజ్ఞాతంగా
ఎవరో చేసిన వాగ్ధానం విని నా మనసు
ఎంతో సంతోషించింది! యిన్ని
వత్సరాల శిశిరానికి యిక సెలవు
తీసుకోవచ్చని ఎదకోయిల పరవశించింది
ఇక గలగలలాడే ఎండుటాకులకి
స్వప్తి పలుకవచ్చని నా హృదయం
మురిసిపోయింది, కానీ మధుమాసం
రాలేదు! మరింత తాపాన్ని కలిగిస్తూ
గ్రీష్మం తన విశ్వరూపాన్ని చూపింది!
శిథిల శిశిరం నీవెంటే నేనున్నానంటూ
నన్ను చూసి పరిహాసంగా నవ్వింది!
ఎప్పటికీ వికసించని నా జీవనోద్యానవనంలో
ఆకులన్నీ వాడిపోయి, పువ్వులన్నీ
రాలిపడి దీనంగా చూస్తూనే వున్నాయి!...

# ఒకే ఒక్క క్షణం

ఓ నిశీధి నిశ్శబ్దరాత్రి... ప్రకృతి హఠాత్తుగా
మేల్కొంది! కారు చీకటి కాళరాత్రి తుళ్ళి
పడిచూసింది! అప్పటి వరకు
గర్భస్థ శిశువుగా వున్న నన్ను మానవలోకానికి
పంపటానికి జనన, మరణ సంవాద యుద్ధభేరి
మ్రోగింది, సరిగ్గా అపుడే ఆకసంలో
ఎక్కడో మెరుపు మెరిసి ప్రళయ గర్జన చేసింది
వెచ్చనైన నాతల్లి గర్భాన్ని వదిలి ద్వారాల్ని
చీల్చుకుని నేను బైటికి రావటానికి ప్రయత్నిస్తున్న
క్షణాలు!... నా తల్లి మరణయాతనతో
పురిటినొప్పుల్ని బాధగా భరిస్తోంది!
నింగినిండా కమ్ముకున్న మేఘాల సమూహం
తీవ్రఘర్షణకు గురై, వానధారలా మారి
ధరిత్రిలో కలిసి కరిగిపోతున్నాయి!
ఎక్కడో పిడుగు పడిన శబ్ధం! ఆ వెంటనే
మేఘాల విద్యుల్లతలా మెరిసిన మెరుపు!
ఒకే ఒక్కక్షణం... రెప్పపాటు జననం
ఏదో తెలియని ఒంటరితనం
పేగు బంధం తెగిన క్షణం..
చల్లగా తాకిన నీటి చుక్కలు,
కెవ్వుమన్న నినాదం! బ్రతుకంతా
కన్నీరైకరిగిపొమ్మని విధాతయిచ్చిన శాపం!
స్త్రీగా జన్మించిన వైనం!...
ఆకాశం భోరున విలపిస్తోంది.
మేఘాల కన్నీటిని!...

# ప్రేమకావ్యం

నా ఒంటరి తనంలో ఆవిర్భవించిన
ఓ ప్రేమకావ్యమా! నీకోసం యీ
మనసెంత పలవరిస్తోందో తెలుసా?
నీకు తెలియదు, నువ్వులేని కాలం
నన్నెంత వేదనల గాయాలకి అంకితం
యిస్తుందో!... యీ నిశ్శబ్దపురేయి కరిగి,
వెలుగు రేఖలుదయించి,
నీపాదాల చిరుసవ్వడి తొలివేకువ
సంగీతమై నా ఎదను మీటి,
హృదయాన్ని పలుకరించి,
ఎన్ని వూహలు, నా ప్రియబంధమా!
మంచుపల్లకిపై మలయపవనంలా,
మండే ఎదలో మల్లెనవ్వులా,
నీస్మృతి నాలో నిత్యవసంతంలా
మరిచిపోని మధురగానంలా
ఎప్పటికీయిలా!...

# ప్రణయభావం

నా హృదయోద్యానవనాన విరిసిన
పారిజాతమా! నాకన్నుల కదలాడే
ప్రణయభావతరంగమా!...
ఏ దూరతీరాలు చేరువ కావాలనే
ఆరాటంతో నీ దరిచేరానో, ప్రియతమా!
ఎదతీరని ఆర్తి, మదిలో కలిగే అలజడి,
ఎంత చెప్పినా వినదీ మనసు అనుక్షణం
నీవూహల్లో విహరిస్తూ, నీ సన్నిధిలో
సేదతీరాలనే! ఎన్ని అనుభూతుల
పూలమాలలు యీ తనువుని మీటినా
యింకా ఏదో కావాలనే! నిజంగా
ఎన్ని జన్మల ప్రియ బంధమిదని
నిర్వచించగలను?... ఏవలపురాగాల
కిన్నెర వీణనై... నీకోసం ఎంతగా వేచి
చూస్తున్నానో తెలుసా? నువ్వొస్తే తప్ప
నామనసు వికసించదని తెలుసు!
ప్రేమతోటలో విరబూసిన పూలన్నీ
అనుభూతుల మాలగా అల్లివుంచాను!
నీచేరువలో నేను, నేను కాను,
నీవే కానుకగా నేనే నీవుగా
ఎప్పటికీ మనంగా!

# మృత్యుఘుంటికలు

రాజు, పేద తేడా లేదు నీకు, పెద్దా, చిన్నా అనే
వయసు తారతమ్యంలేదు, నీకు నూకలు చెల్లిన
మనిషికి కాలం, ఆయువనే తలుపు మూసేస్తే
నువ్వు చీకట్లని చీల్చుకుంటూ నీ కర్తవ్యాన్ని
నెరవేర్చటానికి ఆత్రంగా వస్తావు!
ఆ క్షణం నీ స్పర్శతో తన వునికిని కోల్పోయే
జీవితేచ్ఛ నిర్వికారంగా మారుతుంది!...
సుదూర తీరాలనుంచి విన్పించే మృత్యుఘుంటికలు
జీవితాన్ని నీటి బుడగలా చేసిటప్పున
రాల్చేస్తుంటాయి!. నువ్వు జీవ చైతన్యాన్ని
నిర్జీవ రూపంగా చేసి, నిశ్శబ్దంగా నిష్క్రమిస్తావు!....
నువ్వు చేసిన గాయం, పచ్చికట్టెలా శరీరాన్ని
బిగదీస్తుంది!... అపుడిక ఆ దేహానికి
ఎలాంటి సుఖదు:ఖాల క్రీనీడలు అంటవు!
అంతే! నీ నుంచి తప్పించుకోవటమనేది యీ సృష్టిలో
ఏ జీవికి సాధ్యం కాదు!...

# జీవన దీపం

పడమటి సంధ్యావేళ... పక్షులన్నీ తమ గూళ్లకు చేరుకుంటున్నాయి
ఈ సృష్టిలో ప్రతిజీవికి ఓ గూడువుంది కానీ నాకు మాత్రం గూడేకాదు
నీడ కూడా లేకుండాపోయింది
పగటివేళలు, రాత్రివేళలు ఏదైనా సరే ప్రకృతిని
అనుభవించే రాత్రిలో నేనుకూడా ఓ భాగాన్ని అయ్యాను
గుండెముంగిట విరిసిన ఆశల సుమాలు
నెత్తుటి ధారలో తడిసిపోయాయి,
ఓ విషాదం కురిసిన రాత్రి జీవితం మోడు బారిపోయింది
మోడు వారిన చెట్టయినా కనీసం చివుర్లు వేస్తుందేమో
కానీ, వసివాడిన నా బ్రతుకు పూలరెమ్మకు ఎండుటాకులే మిగిలాయి
నా చుట్టూ ఎడారి అనంతంగా పరుచుకునే వుంది
ఎంత దూరం ప్రయాసపడి నడుస్తూ వెడుతున్నానో
పచ్చని చెట్టు కనుచూపు మేరనైనా కనరాదే! ఎన్నాళ్ళీ వృధా పయనం
ఎడారి దాటాను... అనంత సముద్రజలనిధి నా ముందు నిలిచింది
అప్పుడు గుర్తొచ్చింది, గుండెను పీల్చేస్తున్న దాహార్తి
దోసిటపట్టి తాగిన  నీరు వుప్పగా తగిలింది
నాదాహం తీరలేదు అంతులేని జలసంద్రం నా ముందున్నా
నాదాహం తీర్చుకోవగానికి నాకు చుక్కనీరయినా దక్కలేదు
ఓ మిత్రమా! ఏదీ ఒక్కసారి నావైపు చూడు
నాకళ్ళలోకి చూడు!... భరించలేని బ్రతుకు శోధనని
బరువుగా మోస్తున్న దీనత్వాన్ని చూడు

# ఒక నువ్వూ - ఒక నేను

ఒకప్పటి తియ్యటి కలలకి
ప్రతిరూపమై నాలో మెదిలావు,
ఎన్నో అందమైన అనుభూతులతో
అలవోకగా అలరారే ఊహలతో
నన్నలరించావు.
నాటి కలల వాకిళ్ళకి
ఆశల తోరణానివి నీవైతే,
నీ ఊహలతో పరిమళించి
వికసించిన సంపెంగను
నేనయ్యాను.
కానినాడు ఒకే ప్రాణంగా వున్న
మనము నేడు ఒక నువ్వూ- ఒక నేను గా
మారటం విచిత్రంగా లేదూ!
అందుకే నా "ప్రియ నేస్తం"
మన మధ్యనున్న దూరాన్ని భరించలేకనేపోతున్న
ఈ లోకం నుండే దూరంగా సుదూరంగా
మరెవ్వరికి కన్పించని తీరాలకి
అనామికనై
నిశ్శబ్ధంగా తరలిపోతున్నా!

# స్మృతి

ఎందుకో తెలియదు నువ్వు మరీ, మరీ జ్ఞప్తికి వస్తున్నావు,
ఆరుబయట చల్లని నవ్వులు చిందిస్తూ చంద్రుడు.
హేమంతం ఒడినుండి శిశిరంలోకి జారిపోతున్న ప్రకృతి.
ముంగిలి ముందు నిశ్శబ్దంగా ఆకులు రాల్చే మల్లెచెట్టు.
శిధిలమయిన గతాన్ని విస్మరించి, నవోదయం
ప్రసరింపచేయాలని చూసే వసంతం చలిమంచు
తెరలు లేతగా వణికిస్తోన్న  చిక్కబడిన సాయంత్రం.
నీ జ్ఞాపకాలు మంచు తెరల్లా, చిరుగాలిలా,
ఎంతసేపు చూసినా తనివి తీరని మనోహరమైన నీ చిర్నవ్వు,
ఎన్ని అనుభూతులు అక్షర గవాక్షాలై
నీకోసం నిరీక్షిస్తున్నాయో, "ప్రియతమా" మది వీడని నీ తలపు
నా ఎదలో పలికే తొలివలపు,
నిశ్శబ్ధంగా పరుచుకున్న
నీ స్మృతులలో నిన్ను వెతుక్కుంటూ
నీ కోసం...........